"ఏమైందా.... కొంప కొల్లేరైంది. రాత్రి నువ్వు చేసిన దానికి నానీ తప్పించుకుపోవడమే గాదు, మనమంతా ఆ గుంటడ్ని చంపాలని ఇక్కడకు చేరినట్టు ఆ యశస్వికి తెలిసిపోయింది."

"అదేంటీ" చంద్రం సన్నగా కంపిస్తున్నాడు.

"ఏమిటా.... రాత్రి నువ్వు మందులో ఫోన్ చేసి అన్నమాటల్ని యశస్వి విన్నాడు. ఎందుకంటే ఆ సమయంలో నన్ను నిలదీస్తూ నా గదిలో వున్నాడు కాబట్టి."

చంద్రం వెన్నులో సన్నగా చలి మొదలయింది ""అంటే నానీ ఇంకా బ్రతికే వున్నాడన్నమాట."

* * * *

"నానీ బ్రతికే వున్నాడా?" అన్న మకుటంతో చంద్రం ఇంటర్వ్యూ.

"నానీని హతమార్చే ప్రయత్నంలోనే అనసూయ హత్య చేయబడిందా? అందులో డి.ఎస్పీ సుందర్ పాత్ర ఎంత?" అనే హెడ్డింగుతో యశస్వి ఇంటర్వ్యూ.

పక్క పక్కనే 'నిజం' దినపత్రిక ఈవెనింగ్ ఎడిషన్‌లో ప్రచురింపబడ్డాయి. వాటిని రామసూరి కంక్లూడ్ చేశాడు "చంద్రం తన ఇంటర్వ్యూలో...... 'ఎలాగన్నా అంతుచూస్తానని శపథం చేసిన ఆ పోలీసాఫీసరు' అన్న వాక్యం యశస్వి ఇంటర్వ్యూలో చెప్పిన డి.ఎస్పీ.సుందర్‌ని ఉద్దేశించి అయితే ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోనినాడు నానీని ఎవరూ రక్షించలేరు".

సరిగ్గా ఆ సమయంలో 'నిజం' పత్రికతో బాటు డి ఎస్పీ సుందర్ హోం మినిష్టర్ హౌస్‌లోకి దూకుడుగా ప్రవేశించాడు.

హోం మినిష్టర్ అంతగా కంగారు పడలేదు. కారణం అప్పటికే బాగా కూరుకుపోయాడు ఊబిలో.

పైగా జర్నలిస్టుల భద్రత గురించి రిపోర్టర్స్ అసోసియేషన్ పంపిన మెమోరాండం చదివిన చీఫ్ మినిస్టర్ పరిస్థితి చేయిదాటి పోతూందని గ్రహించడంతో అరగంట క్రితమే ఫోన్‌లో అప్పారావుతో మాట్లాడాడు.

రాందేవ్ హత్యకీ, నానీ పాత్రకి లింకుపెట్టి మరీ కడిగేశాడు.

"మూడురోజులు గడువిస్తున్నాను ఏ పద్ధతి అనుసరిస్తావు అన్నది నా కనవసరం. నిర్దోషిగా నిరూపించుకో. లేకపోతే మూడోరోజు సాయంత్రానికల్లా నువ్వు పదవికి రాజీనామా చేయాలి. అంతటితో ఆగిపోదు. ఆ తర్వాత ఏ హైకోర్టు జస్టిస్‌నో కమీషన్ చేసి ఎంక్వయిరీ గట్రా చేయించాల్సి వుంటుంది. తప్పదు, లేకపోతే ప్రజలు వుమ్మేస్తారు" అదీ ఫోన్ సారాంశం.

"అసలు మీరీ పేపర్ చూశారా" వుక్రోషంగా పత్రికని అతని ముందుంచాడు సుందర్.

“అదేనయ్యా గమ్మత్తు.... పూర్వం మనం చెప్పింది పేపరులో వచ్చేది. ఇప్పుడు పేపరులో చదివి మనం చెప్పుకునే స్థితికి దిగజారిపోయాం కదూ... రోజులు అలా తగలడ్డాయి.”

“అలా వూరుకుంటే లాభంలేదు సర్. అందాకా ఆ యశస్వి గాడ్ని లోపల వేశాను కాబట్టి ఇక ఈ రామసూరిగాడి భరతం పట్టాలి. నేను హరితో చేతులు కలిపానట. నానీని హత్యచేసే ప్రయత్నంలో మా మూలంగా అనసూయ చచ్చిపోయిందట” అరిచాడు ఆవేశంగా.

“అరిస్తే గొంతు నాళాలు పగలడం తప్ప ప్రయోజనం లేదు సుందర్!”.

“ఒక డి.యస్పీ మీద రాయడానికి వాడికెన్ని గుండెలుండాలి!”

“వెర్రి బాగులవాడివయ్యా.... ప్రధానమంత్రి, ప్రెసిడెంట్లకే ఈ పేపరాళ్ళతో గొడవ తప్పడం లేదంటే నువ్వెంత! చూడూ.... నానీగాడ్ని రక్షించుకోవడానికి ఆ యశస్వి, రామసూరిలు అలా చిన్న హడావుడి చేసుంటారు, దీనివలన నీకూ ఓ మేలు జరిగింది” అన్నాడు.

అర్థం కాలేదు సుందర్‌కి.

“అదేనయ్యా....ఇలాంటి ఆధారం లేని అభియోగం మోపినందుకే గదా! నువ్వు యశస్విని లోపలేసింది. అలాగ భయపడకు.... నిజంగా అందుకు కాకపోయినా అందుకే అని చెప్పొచ్చు ప్రజలకి” సాలోచనగా ఆగాడు ఓ క్షణం “చూడు... ఇప్పుడు అర్జెంటుగా నువ్వు చేయాల్సింది రామసూరిమీద చర్య తీసుకోవటం కాదు, నానీని హత్య చేయటం.”

తొట్రుపడ్డాడు సుందర్.

“నువ్వు చేయనక్కరలేదు. బోలెడంత పోలీస్‌ఫోర్సుంది. అందులో నీ కుర్రాళ్ళకి పని అప్పచెప్పెయ్” .

గొంతు తడారిపోయిన సుందర్ “అది జరుగుతుందన్న అనుమానంతోనే కదా యశస్వి రామసూరీ ఈ ఇంటర్వ్యూలు ప్లాన్ చేసింది” అన్నాడు.

“కరక్టేనయ్యా! నా ఎత్తుకు వాళ్ళు పైఎత్తు వేశారు వాళ్ళ పైయెత్తుని చిత్తు చేయాలి. అంటే నానీ పోవాలి. లేదా ముందు నా పదవి పోతుంది. ఆనక నువ్వు పోతావు.
చూశావా! ఓ గుంట వెధవ మన లెవలు మనుషులకి ఎంత అనర్థం తీసుకొచ్చాడో””.

“కానీ అప్పుడు నన్ను అందరూ అనుమానిస్తారు కదండీ”

ముక్కుమీద వేలేసుకున్నాడు “ఛ ఛ.... మనల్ని అనుమానించే ఆస్కారం లేదు. ఎందుకంటే నాలుగో రోజు నానీ కోర్టులో అడుగుపెడితే వాడి తండ్రి పనయిపోతుంది కాబట్టి” క్లుప్తంగా కామేశ్వరి ద్వారా విన్న నానీ కథ చెప్పాడు. “అంచేత నా మాట విని నా మనుషుల్తో బాటు నీ వాళ్లనీ  కాస్త రంగంలోకి దూకేమను. కీలకమయిన
సాక్ష్యం చెరిగిపోగానే తక్కిన కథ నేన్నడిపిస్తాను. వ్యవధిలేదు. రెండు రోజుల్లో జరగాలి”.

సుందర్‌కంతా అయోమయంగా వుది.

నిజమే..... అప్పారావు పొజిషను దిగితే తన మీద వున్న అభియోగాలు వెలుగులోకి

వస్తాయి.

అప్పారావు లేకపోతే తను వుండడు.

తను వుండాలి అంటే అప్పారావు ముందు రక్షింపబడాలి. అంటే నానీ చావాలి... కాని ఎలా?

"సుందర్! ఓపని చేద్దాం- నానీని సురక్షితంగా అప్పచెప్పిన వాళ్లకి నేను పదివేల రూపాయల బహుమతి ప్రకటిస్తాను. ఎందుకంటే ప్రజల దృష్టి మళ్ళించాలి కాబట్టి.... జనం వెర్రిబాగుల వాళ్ళుకదా. నా గనికొండ సమస్య, నీ పై వున్న రిపోర్ట్లు కొంతసేపు మరిచిపోతారు.... ఇక్కడ నీ డిపార్టుమెంటుకున్న సుఖం ఏమిటంటే నానీని రక్షించే నెపంతో ఏ మూలకైనా వెళ్ళగలగడం. పోలీసులంటే తప్పకుండా సహకరిస్తారుగా- అంతేకాదు... ఆనక పనిలేని ప్రజ కూడా రంగంలోకి దిగి నానీని వెదుకుతుంది. నానీ మీద ప్రేమతో కాదు, బహుమతి ప్రకటించాంగా."

"ఒకవేళ నానీని సురక్షితంగా తీసుకొస్తే మళ్ళీ మీకే ప్రమాదం కదండీ".

"అదేనయ్యా రాజకియం... కొంచెమాగు.... అలా దొరికినవాడ్ని తిరిగి మీకే అప్పచెప్పుతారుగా.... అప్పుడు నువ్వు వాళ్ళ నాన్నని పిలిపిస్తావు... ఇద్దరు కానిస్టేబుల్స్ నానీని వాళ్ళూరు పంపే ఏర్పాట్లు చేస్తావు. అప్పుడు తోవలో కొందరు కానిస్టేబుల్స్ పై 'ఎటాక్' అయి అక్కడే నానీని చంపేస్తారు."

"వాళ్ళెవరూ?"

"మన మనుషులే"

"అప్పుడు..." సుందర్కి కన్ఫ్యూజ్గా వుంది "మళ్ళీ అనుమానం నా మీదకు రాదూ".

"రాదు..." టక్కున చెప్పాడు అప్పారావు ""ఎందుకంటే వాడు బ్రతకడం, కోర్టుకొచ్చి వాడి అమ్మ విషయంలో సాక్ష్యం చెప్పడం చంద్రంగాడికి ప్రమాదమే కాబట్టి వాడే చంపేసే ఏర్పాటు చేశాడని అటు నెట్టేద్దాం.

ఓ పని పూర్తయిపోతుంది."

ఓ అరగంటలో ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి నానీ కోసం బహుమతిని ప్రకటించడం గట్రా పూర్తి చేశారు.

ఇక్కడ పత్రికా ప్రముఖుల మధ్య డి.యసీ. సుందర్ కూడా విపరీతమైన బాధని అభినయించాడు "ఓ పసికందుపై నేను అఘాయిత్యం తలపెడుతున్నానని పత్రికలో రాయడం నేను గట్టిగా ఖండిస్తున్నాను. నానీ దొరకగానే ఇలా మిమ్మల్ని రప్పించి ఆ పసిబిడ్డ నన్ను నేరస్థుడిగా మీకు తెలియచేస్తే ఉద్యోగానికి రాజీనామా చేస్తానని ప్రమాణం చేస్తున్నాను."

కొంచెం ప్రశాంతంగా వుంది అప్పారావు కిప్పుడు.

ఈ వార్త రేపు ఉదయానికి ప్రచురింపబడితే ఆ తర్వాత నలభై ఎనిమిది గంటల్లో ఎన్ని అనర్థాలు సీరియల్ గా జరగాల్సిందీ ఆలోచిస్తున్నాడు.

పత్రికా విలేఖర్లు వెళ్ళిపోయినా పది నిముషాలపాటు పచార్లు చేస్తూనే వున్న అప్పారావు డి.యస్పీని చూస్తూ అన్నాడు.

"అవునూ.... ప్రెస్ కాన్ఫరెన్స్‌కి రామసూరి రాలేదు కదూ?"

"వాడు దొరకలేదండీ"

"తెలివయిన వాడుగా.... దొరకడు..."

"అవును దొరికితే నేను దుంప తెంచేవాడ్ని...." సుందర్ ఆవేశంగా అన్నాడు.

"లేదు సుందర్..... వాడు రాకపోవడమే మనకు చేసిన పెద్ద మేలు లేకపోతే

నిన్నూ,

నన్నూ నిజంగా కంగారు పెట్టే అంత మేధావి.... నిన్ను నువ్వు ఎక్కువగా అంచనా వేసుకో అభ్యంతరంలేదు..... కాని వాడ్ని మాత్రం తక్కువగా ఆలోచించకు-".

"ఓ పనిచేస్తే సరిపోతుంది" అన్నాడు సుందర్.

"ఇదంతా మనకి అనుకూలంగా నిరూపించబడ్డాక ఓ తప్పుడు వార్త ప్రకటించాడన్న నేరంపై వాడ్ని లోపలవేసి తోమి వదిలిపెడతాను."

"అది అలా అన్నావు బాగుంది" సెట్ చేశాడు అప్పారావు.

"అసలు!"

ఫోన్ రింగయ్యింది.

ఉలిక్కిపడ్డాడు అప్పారావు "మళ్లీ అది ఏ రాజధాని ఫోనో అయ్యుంటుంది. నువ్వందుకో. నేను లేనని చెప్పేయ్" హడావుడిగా అన్నాడు సుందర్‌తో.

రిసీవర్ని అందుకున్న సుందర్ "హల్లో!" అన్నాడు .

"గుడ్ మాణింగ్ మిస్టర్ సుందర్!" వినిపించింది ఆవలి వేపునుంచి. అంతేకాదు- ఆ ఫోన్ ఎక్కడ్నుంచో అర్థంకాగానే ఆవేశపడ్డాడు కూడా "నాకు తెలుసు మీరక్కడే వుంటారని-" రామసూరి గొంతు వ్యంగ్యంగా పలికింది.

"నాతో ఏం పని నీకు?"

"కొంచెం వినండి అర్థమవుతుంది"

ఏదో 'ఆన్' చేసిన చప్పుడు...

వినకూడనిది వింటున్నట్లు ఎలర్టు అయిపోయాడు.

ఒకటి... రెండు... మూడు....

అయిదు నిమిషాలు గడిచాయి.

అప్పటికే సుందర్ నుదురు చెమటతో తడిసిపోయింది "ఏంటి దంతా"

"మీ స్టేషన్‌లో యశస్వి మాట్లాడుతుండగా రికార్డు చేసిన చర్చ. ఇది చాలనుకుంటాను

నువ్వు పరోక్షంగా నేరస్థుడివని నిరూపించడానికి. అవునూ... పేపరులో చంద్రం యింటర్వ్యూ కూడా చూసే వుంటావు. దట్ ఆల్సో రికార్డెడ్...."

"అందులో ఆ చంద్రంగాడు నేను నానీ వెంటపడుతున్నానని నీకు చెప్పాడా"

"అలా బలమైన ఆధారం సంపాదించాకనే నేను పత్రికల్లో పబ్లిష్ చేసింది. సో... నువ్వు నన్ను ఏమీ చేయలేవు- అందాకా ఓ పనిచెయ్...... యశస్విని విడిచిపెట్టు"

"అసంభవం"

"అయితే రేపు దినపత్రికలో మళ్ళీ పోటోలు వస్తాయి. అదే! అక్కడ నువ్వు స్మశానవాటికలో కాటికాపర్ని కొట్టావే.... తీశానులే......నిజం చెప్పొద్దూ నువ్విలాంటి మగాడివని తెలీక నేనూ యశస్వి చాటుగా నిన్ను వెంటాడింది.... అక్కడ సమాధుల మధ్య ఓ నిజాన్ని ఎలా సమాధిచేసే ప్రయత్నం కొనసాగించావు అనేది ప్రజలకు తెలిసిపోతుంది. అవునూ.... యశస్వి పోలీసాఫీసర్ కాబట్టి సొంత పూచీ కత్తుపై విడిచి పెట్టొచ్చుగా. ఓహో -నానీని లేపేయాలని మీ ప్రయత్నానికి అడ్డం అనుకున్నావేమో.... కదూ- రిడిక్యులస్ మిష్టర్ సుందర్..... ఆ హరికి ఎన్నాళ్ళు షెల్టరిస్తావో నేనూ చూస్తాను. మర్యాదగా యశస్విని విడిచిపెట్టేయ్. ఓకే".

"బాస్టర్డ్" ఫోన్ క్రెడిల్ చేసి సుందర్ జరిగిందంతా చెప్పాడు అప్పారావుతో "వీడ్ని.... వీడ్నేదో చేయాలి......" ఉక్రోషమగా మండిపడుతున్నాడు.

అప్పారావు వెంటనే జవాబు చెప్పలేదు. చెప్పలేని సందిగ్దతలోనే అప్పారావు తల పట్టుకుంటాడని సుందర్‌కి తెలుసు.

కొన్ని క్షణాలు అలాగే నిలబడిన అప్పారావు ఫోన్ చేశాడెక్కడికో... ఆ సమయంలో హరి ఎక్కడ వుండేది అప్పారావుకి తెలుసు.

"నేనే హరీ... అప్పారావుని. అదే మీ అందరి అసమర్ధతతో కుడితిలో పడ్డ ఎలుకలా కొట్టుకుంటున్న హోమ్ మినిష్టర్‌ని. నాకు చీఫ్ మినిష్టర్ డెబ్బయి రెండుగంటల అవకాశమిచ్చాడు. నేను నీకు నలభై ఎనిమిది గంటలే గడువిస్తాను, ఈ లోగా నాని శవం కావాలి. లేదా..." ఓ క్షణం ఆగాడు ""నువ్వు అనసూయని హత్య చేసిన కారణంగా పోలీసులకి సరెండర్ కావాలి. చెప్పేది విను. లేకపోతే డొంకంతా కదిలిపోతుంది. సమస్య ఒకదానికొకటి లింకుగా పెద్ద గొలుసై ఆనక అది నాకు ఉరిత్రాడుగా మారుతుంది. ఇక నువ్వు చెప్పేది నేను వినను. నువ్వు సరెండర్ కాకపోయినా నేనే పట్టిస్తాను.... అంతే" రోషంగా ఫోన్ పెట్టేశాడు.